సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం : 16 : మే : 2023



ఇద్దరు దొంగల ఆటకట్టు

రాజంపేట, ఓబులవారిపల్లెలో జరిగిన దొంగతనాల్లో ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10,50,000 విలువ చేసే 208 గ్రాముల బంగారు నగలను రికవరీ చేశారు. - 8లో



రూ.33 లక్షల విలువైన 165 మొబైల్ ఫోన్లు రికవరీ

పోలీసు శాఖ చేపట్టిన మొబైల్ ఫోన్ల రికవరీ సత్ఫలితాలను ఇస్తోందని అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావు అన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.136
రెండోరకం	రూ.66	రూ.98



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 827 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	305	514
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 141.80 కిలోలు

దారికాచిన మృత్యువు

- వైఎస్సార్ జిల్లా ఏటూరు వద్ద రోడ్డు ప్రమాదం
- సంఘటన స్థలంలోనే ఏడుగురు దుర్మరణం
- డ్రైవర్ మినహా మిగిలిన వారంతా బంధువులే..

కాసేపట్లో గమ్యం చేరుకోవాల్సిన వారిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. అక్కాచెల్లెళ్లు తమ కుటుంబాలతో తిరుమల దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు దుర్మరణం చెందారు. వీరిలో నలుగురు అక్కచెల్లెళ్లు, వారి ఇద్దరు కుమారులతో పాటు డ్రైవర్ ఉన్నారు. మృతుల్లో ఇద్దరు తాడిపత్రికి చెందిన తల్లీ కుమారుడు ఉన్నారు. ఎక్కడికెళ్లినా కలిసి వెళ్లే అక్కాచెల్లెళ్లు ఆఖరుకు మృత్యువులోనూ కలిసే వెళ్లిపోవడం అందరినీ కలచివేసింది. వివరాలిలా ఉన్నాయి.



ప్రమాదం జరిగిన కొండాపురం-తాడిపత్రి జాతీయ రహదారి (ఇన్‌సెట్) మృతులు తల్లీ కుమారుడు వెంకటలక్ష్మి, సునీల్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

తాడిపత్రి అర్బన్/జమ్మలమడుగు/కొండాపురం : వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం సేదరపేటకు చెందిన వి.చెన్నారెడ్డి, లక్షుమమ్మ దంపతులకు ఆరుగురు కూతుళ్ల సంతానం. వీరిలో ఒకరు చనిపోయారు. మిగిలిన ఐదుగురిలో వెంకటలక్షుమ్మ పెద్ద ది. ఈమె భర్త కంచం ప్రసాద్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం గుండెపోటుతో మరణించాడు. కంచం వెంకటలక్షుమ్మ (55) చిన్నకుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డి (27)తో కలిసి తాడిపత్రి కృష్ణాపురం నాలుగో రోడ్డులో అద్దె ఇంటిలో నివాసముంటోంది. ఈమె పెద్ద కుమారుడు సురేంద్రకుమార్‌రెడ్డి బళ్లారిలో వాటర్‌ప్లాంట్ నిర్వహిస్తూ అక్కడే నివాసముంటున్నాడు. అప్పుడప్పుడు తల్లిని చూసేందుకు తాడిపత్రి వచ్చి వెళ్తుంటాడు. చీరల వ్యాపారంతో పాటు టైలరింగ్ పని చేసే వెంకటలక్షుమకు చిన్న కుమారుడు సచివాలయ వలంటీర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటుండేవాడు.

అన్యోన్యతకు మారుపేరు ఆ అక్కాచెల్లెళ్లు..

వెంకటలక్షుమ్మ, ఆమె చెల్లెళ్లు ఎంతో అన్యోన్యంగా కలిసిమెలిసి ఉండేవారు. ఎక్కడికి వెళ్లినా అందరూ కచ్చితంగా కలిసివెళ్లేవారు. ఐకమత్యానికి ప్రతిరూపాలుగా ఉన్న వెంకటలక్షుమ్మ, ఆమె ముగ్గురు చెల్లెళ్లు బళ్లారికి చెందిన సిరయ్యగారి లక్ష్మీదేవి అలియాస్ బుజ్జి (39), కాటసాని సుభద్ర (35), వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు చెందిన కాటసాని సుమలత(38) తిరుమల శ్రీవారి దర్శనం వెళదామని నిర్ణయించుకున్నారు. శనివారం అద్దె తూఫాన్ వాహనంలో అక్కచెల్లెళ్లు తమ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లారు. స్వామికి మొక్కులు చెల్లించుకుని.. ఆనందంగా తిరుగుపయనమయ్యారు. వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలం ఏటూరు గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద వీరి వాహనాన్ని ఎదురుగా వచ్చిన లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటలక్షుమ్మ, ఆమె కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డి, చెల్లెళ్లు లక్ష్మీదేవి, సుమలత, సుభద్ర,తో పాటు సుభద్ర కుమారుడు లిఖిత్‌కుమార్‌రెడ్డి(11), వైఎస్సార్ జిల్లా లింగాల మండలానికి చెందిన డ్రైవర్ సుధాకర్‌రెడ్డి దుర్మరణం చెందారు. అర గంటలో తాడిపత్రికి చేరుకోవాల్సిన వారంతా విగతజీవులై రావడం బంధువుల్లో తీవ్ర విషాదం నింపింది.ఈ ప్రమాదంలో మరో ఐదుగురు గాయపడ్డారు. తల్లి, తమ్ముడి మృతదేహాలను చూసి సురేంద్రకుమార్‌రెడ్డి గుండెలవిసేలా రోదించారు. నన్ను అనాథను చేసి వెళ్లిపోతిరా.. దేవుడా ఎంత పనిచేశావయ్యా.. అంటూ విలపించాడు.

ఆస్పత్రిలో ఆర్తనాదాలు

యాడికి : తిరుమల నుంచి తాడిపత్రికి వస్తున్న తూఫాన్ వాహనం వైఎస్సార్ జిల్లా ఏటూరు సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని తాడిపత్రి ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు, మృతుల కుటుంబ సభ్యుల ఆర్తానాదాలతో పరిసరాలు దద్దరిల్లాయి. మృతదేహాలు గుర్తించలేనంతగా ఉండటంతో బంధువులు, కటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. తాడిపత్రిలో క్రిష్ణాపురం నాలుగో రోడ్డులో ఉన్న వెంకటలక్ష్మమ్మ(55), కుమారుడు, వలంటీర్ అయిన సునీల్ కుమార్‌రెడ్డి(27)ల మృతదేహాలను చూసేందుకు కాలనీవాసులతో పాటు సచివాలయ సిబ్బంది తరలివచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

డ్రైవర్‌గా వెళ్లి మృత్యుఒడికి

లింగాల : జిల్లాలోని కొండాపురం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భూమిరెడ్డి సుధాకర్‌రెడ్డి కొంతకాలంపాటు లింగాల మండలం అమగంపల్లెలో నివాసం ఉన్నారు. భార్యాభర్తలు విడిపోవడంతో సుధాకర్‌రెడ్డి రెండో వివాహాన్ని పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామంలో చేసుకున్నారు. అయితే ఆయన సోదరికి అమగంపల్లె గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం చేయడంతో ఆయన కొన్నిరోజులపాటు అక్కడే ఉన్నారు. ఆయన తండ్రి నారాయణరెడ్డి గతంలోనే మృతి చెందాడు. ప్రస్తుతం తల్లి నారాయణమ్మ అమగంపల్లెలోనే కుమార్తె వద్ద ఉంటోంది. సుధాకర్‌రెడ్డి తాడిపత్రిలోని చేనేత కాలనీలో నివాసముంటున్నాడు. తుఫాను డ్రైవర్‌గా వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.

మృతి చెందిన మహిళ అంత్యక్రియలు పూర్తి

కొండపురం మండలం ఏటూరు చిత్రావతి బ్రిడ్జిసమీపాన ఉన్న మలుపు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. వీరిలో మైలవరం మండల కేంద్రానికి చెందిన మార్తల సుమలత (38) మృతి చెందింది. సోమవారం రాత్రి మైలవరంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. బంధువులు, స్థానికులు తరలి వచ్చి భర్త బాబుల్‌రెడ్డికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాబుల్‌రెడ్డి ఎల్‌ఐసి ఏజెంట్‌గా ఉంటున్నాడు. పిల్లల చదువు కోసం జమ్మలమడుగు పట్టణంలో కాపురం ఉంటున్నాడు. సుమలతకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.

సంఘటన స్థలం పరిశీలన



సంఘటన స్థలాన్ని వైఎస్సార్‌జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానిక డీఎస్పీ నాగరాజుతో మాట్లాడారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సంఘటనపై ఎస్పీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.క్షత గాత్రుల పరిస్థితి గురించి ఆరా తీశారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



అనంతపురం క్రైం : వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలం ఏటూరు బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని కలెక్టర్ గౌతమి సోమవారం పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మధుసూదన్, డీఐఓ డాక్టర్ యుగంధర్, తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

సత్వరం స్పందించాలి



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ

రాయచోటి : స్పందన కార్యక్రమం ద్వారా అందుతున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని పోలీసు అధికారులు జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 57 ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఎస్పీ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా కుటుంబ కలహాలు, ఆర్థికపరమైన నేరాలు, ఆస్తి తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయని ఎస్పీ పేర్కొన్నారు.

పీలేరు నుంచి స్పెషల్ యాత్ర బస్సులు

పీలేరు రూరల్ : తమిళనాడులోని పర్యాటక కేంద్రం మున్నార్‌కు పీలేరు నుంచి స్పెషల్‌యాత్ర బస్సులు నడుపుతున్నట్లు డీఎం కుమార్ తెలిపారు. ఈ నెల 20న ఒక సర్వీసు, 22న మరో సర్వీసు మున్నార్‌కు పంపుతున్నట్లు చెప్పారు. అలాగే భద్రాచలం, మంత్రాలయం, శ్రీశైలం, వేలాంగిణి, హైదరాబాద్ ముచ్చింతల్‌కు స్పెషల్ యాత్ర బస్సులు నడుపుతున్నామన్నారు. కాగా, ఈ నెల 29న శ్రీహరికోటకు రాకెట్ లాంచింగ్ కార్యక్రమానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. వివరాలకు 7893152748 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్ : జవహర్ నవోదయ విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో (11వ తరగతిలో) చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మదనపల్లె నవోదయ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చెన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, కామర్స్ గ్రూపులలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు www. navodaya.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

అలెర్ట్ యాప్ సృష్టి



యాప్‌ను ప్రారంభిస్తున్న శశిర్

కురబలకోట : మండలంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థులు ఎం.రషీద్ అహమ్మద్, వి.విశ్వనాథ్, కేవీఎస్ అరవిందగౌడ్, రిత్విక్ కుమార్, ద్వితీయ సంవత్సర విద్యార్థి పి.జయప్రకాష్, విభాగాధిపతి చొక్కనాథం, అసిస్టెంట్ ప్రొఫెసర్ త్రినాథ్ ఆధ్వర్యంలో మిట్స్ అలెర్ట్ పేరుతో యాప్‌ను తయారు చేసినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ సోమవారం తెలిపారు. ఆండ్రాయిడ్ స్టూడియో, జావా, ఫైర్ బేస్, ఎక్స్ ఎంఎల్‌ను ఉపయోగించి దీన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా మొబైల్స్‌కు సమాచారం అందించడం, ఇంటర్న్‌షిప్, ప్లేస్‌మెంట్ తదితర సమాచారాలను రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. కళాశాల అకడమిక్ కౌన్సిల్ మెంబరు కె.శశిర్ ప్రారంభించారు.

చదరంగం విజేతగా భగతీశ్వర్‌రెడ్డి

కడప స్పోర్ట్స్ : ఫిడే ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ విజేతగా కమలాపురం పట్టణానికి చెందిన భగతీశ్వర్‌రెడ్డి నిలిచాడు. అనంతపురంలో ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన ఫిడే ఇంటర్నేషనల్ రేటింగ్ టోర్నమెంట్‌లో 9 రౌండ్లకు 8.5 పాయింట్లు సాధించి రూ.7వేలు నగదు బహుమతితో పాటు 68 రేటింగ్ పాయింట్లు సాధించాడు. ఈయన ప్రతిభ పట్ల జిల్లా చదరంగం అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ అభినందనలు తెలిపారు.

వైవీయూ వీసీతో ఎస్కేయూ వీసీ భేటీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్‌తో అనంతపురం ఎస్కేయూ వైస్ చాన్సలర్ ఆచార్య ఎం.రామకృష్ణారెడ్డి భేటీ అయ్యారు. సోమవారం వైవీయూలోని వీసీ చాంబర్‌లో ఇరువురు సమావేశమై పరిపాలన పరమైన అంశాలను చర్చించారు. అనంతరం ఎస్కేయూ వీసీని గౌరవపూర్వకంగా సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల్లోని సంక్షేమ ఫలాలను అర్హులకు అందించడంలో మెప్మా ఆర్పీలు కీలకపాత్ర పోషించాలని మెప్మా పీడీ సురేష్ రెడ్డి తెలిపారు.సోమవారం నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో మెప్మా ఎండీ విజయలక్ష్మి ఆదేశాల మేరకు వైయస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని రీసోర్స్ పర్సన్లకు జిల్లా స్థాయి రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి బ్యాచ్‌కు సంబంధించి జమ్మలమడుగు, బద్వేలు, ఎర్రగుంట్ల మున్సిపాలిటీలోని రిసోర్స్ పర్సన్స్‌కు రెండు రోజులపాటు శిక్షణ ఉంటుందని, మిగిలిన మున్సిపాలిటీలకు ఈ నెల 31 వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రతి మున్సిపాలిటీలోని స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు ఆర్పీలు కృషి చేయాలన్నారు. సంఘ సమావేశాల పుస్తక నిర్వహణలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. రెండు రోజులు పాటు జరిగే శిక్షణ కార్యక్రమంలో మెప్మా, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు నాగరాజు, గోపీనాథ్, ఐటీ యాంకర్ పర్సన్ శంకర్ ప్రసాద్, జిల్లా రీసోర్స్ పర్సన్స్ జోసఫ్, శోభ, చంద్ర శేఖర్, బద్వేలు జమ్మలమడుగు సీపీఎం గంగులయ్య, అయ్యవారయ్యతోపాటు పలువురు ఆర్పీలు పాల్గొన్నారు.

ఐటీఐ అభ్యర్థులకు సెంచరీ ప్లైవుడ్‌లో ఉద్యోగాలు

కడప ఎడ్యుకేషన్ : బద్వేల్‌లో స్థాపించబడిన సెంచరి ప్లైవుడ్ సంస్థలో ఐటీఐ ఉత్తీర్ణులైన పురుష అభ్యర్థులకు ఉద్యోగ అవకాశం కల్పించబడుతుందని ప్రభుత్వ డీఎల్‌టీసీ ప్రిన్సిపల్, ప్రభుత్వ మైనార్టీ ఐటీఐల జిల్లా కన్వీనర్ జ్ఞానకుమార్ తెలిపారు. అభ్యర్థులు 2020, 2021, 2022 సంవత్సరంలో ఐటీఐ ఉత్తీర్ణత అయి 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మెషినిస్టు, వెల్డర్, డీజిల్ మెకానిక్, మోటర్ మోకానిక్ కోర్సులకు చెందిన ఆసక్తి కలిగిన వారు ఈనెల 19వ తేదీన కడపలోని ప్రభుత్వ డీయల్‌టీసీ/ఐటీఐ నందు ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలన్నారు. విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఫొటోతో రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని తెలిపారు.

'స్పందన' అర్జీలు వేగంగా పరిష్కరించండి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్‌ఓ సత్యనారాయణ హాజరయ్యారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు.

ప్రజల నుంచి అందిన వినతులు..

- చిన్నమండెం మండలం కలిబండ గ్రామం కోలావాండ్లపల్లె గ్రామ నివాసి ఓబులరెడ్డి తన భూమికి వెళ్లడానికి దారి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.
- వాయల్పాడు మండలం దండువారిపల్లెకు చెందిన డి.మంజుల తన అమ్మ వినాయక మహిళ మండలి సభ్యురాలిగా ఉన్నారని ఆమె ఇటీవల మరణించారని గ్రూపులో ఆమె పొదుపు చేసుకున్న డబ్బులను ఇప్పించాలని విన్నవించారు.
- కలికిరి మండల కేంద్రానికి చెందిన ఎం.రమాదేవి సర్వే నెంబర్ 446లోని తన భూమిని సర్వే చేయించి హద్దులు నిర్ణయించి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు.



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

ఎన్‌సీడీ-సీడీ సర్వే లక్ష్యాన్ని సాధించాలి

జిల్లాలో ఎన్‌సీడీ-సీడీ సర్వే లక్ష్యాన్ని వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి ఎన్‌సీడీ-సీడీ సర్వే, అనీమియా నివారణ, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో దాదాపు 16 లక్షల మందికి సంబంధించి ఎన్‌సీడీ-సీడీ సర్వే చేయాల్సి ఉందని, ఇందులో ఇప్పటి వరకు 12 లక్షల మందికి సర్వే పూర్తి చేశారన్నారు. మిగిలిన లక్ష్యాన్ని ఏఎన్ఎం, ఆశా, వైద్యాధికారి సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. హైపర్ టెన్షన్ సస్పెక్టెడ్ కేసులు 6853 పెండింగ్‌లో ఉన్నాయని, నాలుగైదు రోజులలో పెండింగ్ కేసులు పరీక్షలు పూర్తి చేయాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లాలో తీవ్ర రక్తహీనత, రక్తహీనతతో బాధపడుతున్న వారికి ప్రత్యేక దృష్టితో చికిత్సను అందజేయాలని కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. ఇందుకు ప్రతి సచివాలయం పరిధికి హిమోగ్లోబిన్ టెస్టింగ్ కిట్లను సరఫరా చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆరోగ్య మిత్ర కార్యకర్తలకు హిమోగ్లోబిన్ టెస్టింగ్ కిట్లను కలెక్టర్ అందజేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్, ఎన్‌సీడీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ శేషగిరి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యకు ఆదర్శ

- మోడల్ స్కూళ్లలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు
- జూన్ 11న ప్రవేశ పరీక్ష
- ఈనెల 25 వరకు దరఖాస్తుల స్వీకరణ

జిల్లాలో ఉన్న మోడల్ స్కూల్ పాఠశాలలు: 17

6వ తరగతిలో సీట్లు: 1700

2022-23 పదో తరగతి పరీక్ష రాసిన విద్యార్థులు: 1469

పాసైనవారు: 1217



తంబళ్లపల్లెలోని మోడల్ స్కూల్

మదనపల్లె సిటీ: దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిరుపేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ విద్యను చేరువ చేయాలనే సంకల్పంతో ఏపీ మోడల్ పాఠశాలలను 2013లో ప్రారంభించారు. మహానేత రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా నేడు మోడల్ పాఠశాలలు విప్లవాత్మక ఫలితాలు సాధిస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో మాదిరిగా మోడల్ స్కూళ్లలో ఇంగ్లీషు బోధనతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.

జిల్లాలోని మోడల్ స్కూళ్లు

నిమ్మనపల్లె, ములకలచెరువు, పీటీఎం, తంబళ్లపల్లె, పెద్దమండ్యం,కలకడ, రామసముద్రం, కేవీ పల్లె, బి.కొత్తకోట, కురబలకోట, పెనగలూరు, పుల్లంపేట, సంబేపల్లి, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండ్యం

ఆరో తరగతికి దరఖాస్తుల ఆహ్వానం

మోడల్ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది.ఈనెల 25 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థి అర్హతను పరిశీలించి అర్హుడని తేలితే క్రెడిట్, డెబిట్ నెట్ బ్యాంకింగ్ కార్డులు ఉపయోగించి గేట్‌వే ద్వారా రుసుం చెల్లించిన తర్వాత ఒక జర్నల్ నంబర్ కేటాయిస్తారు. ఆ నంబర్ ఆధారంగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. సీఎస్ఈ. ఏపీ.జీవోవీ.ఇన్.ఏపీఎంఎస్.ఏపీ జీవోవీ.ఇన్ ఆన్‌లైన్‌లో ప్రవేశించి దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం నకలును పాఠశాలల్లో సమర్పించాల్సి ఉంటుంది .

పేద విద్యార్థులకు వరం

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదివించేందుకు ఆర్థిక స్తోమత లేని పేద విద్యార్థులకు మోడల్ పాఠశాలలు వరంగా మారాయి. జిల్లాలో 17 మోడల్ పాఠశాలలున్నాయి. ఇందులో 1700 సీట్లు ఉన్నాయి. బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాలల వద్దనే వసతిగృహాలు నిర్మించారు. విద్యార్థులకు విద్యాభ్యాసంపై మరింత శ్రద్ధపెంచుకునే అవకాశం కలిగింది. ప్రతిభావంతులైన పిల్లలకు పూర్తిస్థాయిలో ఇంగ్లీషు మీడియం విద్యను అందిస్తున్న మోడల్ పాఠశాలలోల ప్రవేశం పిల్లల భవితకు చక్కని అవకాశంగా మారిందని తలిదండ్రులు భావిస్తున్నారు.

అర్హత, ఫీజు వివరాలు..

ఓసీ,బీసీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1,2013 ఆగస్టు 31వతేదీ మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీల విద్యార్థులు రూ.75, ఓసీ,బీసీలు రూ.150 చెల్లించాలి. ప్రభుత్వం లేక ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా 2021-2022, 2022-2023 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివి ఉండాలి.

ఎంపిక విధానం ఇలా...

మోడల్ పాఠశాలల్లో ఆరో తరగతిలో చేరేందుకు ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నారు. జూన్ 11న ప్రవేశ పరీక్ష జరగనుంది.ఓసీ,బీసీ విద్యార్థులు కనీసం 35 మార్కులు, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు రావాలి. ప్రతిభ ఆధారంగా, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఎంపిక విషయంలో హెచ్‌ఎంలకు ఎలాంటి అధికారాలు ఉండవు. జిల్లా డిఈవో పర్యవేక్షణలో ఎంపిక జరుగుతుంది.

ఇవీ ప్రత్యేకతలు

- 6 నుంచి ఇంటర్ వరకు ఒకే చోట చదివే అవకాశం
- అత్యాధునిక తరగతి గదులతో ఇంగ్లీషు మీడియంలో బోధన
- క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యా బోధన
- 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే బాలికలకు ఉచిత వసతిగృహ సదుపాయం.
- ఉన్నత విద్యార్హతలు, అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే బోధన
- పోటీ పరీక్షలకు విద్యార్థులను ఆరో తరగతి నుంచే సన్నద్ధం చేయడం.
- శారీరక, మానసిక దృఢత్వం కోసం విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడం.

నాణ్యమైన బోధన



పేద విద్యార్థులకు మోడల్ పాఠవాలలు బంగారు భవిష్యత్తు ఇస్తాయి. ఐదో తరగతి పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి. ప్రైవేటు,కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మోడల్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. నాణ్యమైన విద్యాబోధనతో పాటు పాఠపుస్తకాలు యూనిఫాం ఉచితంగా ఇస్తారు .బాలికలలకు వసతిగృహం అందుబాటులో ఉంది. పేదవిద్యార్థులకు ఇది మంచి అవకాశం. – హేమంత్‌కుమార్, మోడల్ స్కూల్‌ప్రిన్సిపల్, తంబళ్లపల్లె

విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే



శిక్షణ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డీఈఓ పురుషోత్తం

రాయచోటి : విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉపాధ్యాయులు ఉండాలని డీఈఓ శ్రీరామ్‌పురుషోత్తం అన్నారు. రాయచోటి ఏపీ మోడల్ స్కూల్‌లో డీఎస్సీ 1998, డీఎస్సీ 2008 మరియు డీఎస్సీ 2018లో టైం స్కేల్‌లో నియమింపబడ్డ పాఠశాల సహాయకులకు ఐదు రోజుల ప్రేరణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంతమంది ఉపాధ్యాయులు విద్యార్థులను పరీక్షలలో కాపీ కొట్టేలా ప్రోత్సహిస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు మంచి దారిలో ప్రయాణించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ బి.వరలక్ష్మి, సీఎంఓ కరుణాకర్, రాయచోటి మండల విద్యాశాఖ అధికారి ఎం.బాలాజీనాయక్, డైట్ బోధనా సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య

పెద్దతిప్పసముద్రం : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. పెద్దతిప్పసముద్రం మండలంలోని రంగసముద్రంకు చెందిన జూటూరి గిరీష్ (25) జీవితంపై విరక్తి పెంచుకుని ఇంట్లోనే ఫ్యానుకు ఉరేసుకుని సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాల కారణంగానే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పురుగుల నివారణ మందు తాగి..

పెద్దమండ్యం : పురుగుల నివారణ మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని సీగొల్లపల్లె పంచాయతీ కుడుములవారిపల్లెలో సోమవారం ఈ ఘటన జరిగింది. ఎస్ఐ వినోద్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బుషిరెడ్డి కుళ్లాయిరెడ్డి వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. చిన్నమండ్యం మండలం కలిబండలో జరిగిన పాలేటమ్మ తిరునాలకు వెళ్లాడు. ఆదివారం రాత్రి ఇంటికి రాకపోవడంతో భార్య జయసుధ బంధువులకు ఫోన్ ద్వారా తెలియజేసింది. సోమవారం తెల్లవారుజామున పొలం వద్ద పురుగుల నివారణ మందు తాగి అపస్మారకస్థితిలో ఉండగా 108 ద్వారా రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్‌లు తెలిపారు. రెండు ఎకరాలలో టమాట పంట సాగు చేసి అప్పులు కావడంతో కుళ్లాయిరెడ్డి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇద్దరు దొంగల ఆటకట్టు



రికవరీ చేసిన బంగారు నగలు చూపుతున్న డీఎస్పీ వీఎన్‌కే చైతన్య



పోలీసుల అదుపులో ఉన్న వెంకటసుబ్బయ్య, ఇబ్రాయిల్

- రూ.పదిన్నర లక్షల బంగారు రికవరీ
- రాజంపేట డీఎస్పీ వీఎన్‌కే చైతన్య

రాజంపేట : సబ్‌డివిజన్ పరిధిలోని రాజంపేట, ఓబులవారిపల్లెలో జరిగిన దొంగతనాల్లో ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10,50,000 విలువ చేసే 208 గ్రాముల బంగారు నగలను రికవరీ చేశారు. సోమవారం ఎస్‌డీపీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజంపేట డీఎస్పీ వీఎన్‌కే చైతన్య వివరాలు వెల్లడించారు. రాజంపేట పట్టణం నలందా స్కూల్ సమీపంలోని మెహరబాబనగర్‌లో నివాసం ఉంటున్న జోజిరెడ్డి అశోక్‌రెడ్డి ఇంటిలో చోరీ సంఘటనకు సంబంధించి సమ్మద్‌హాల్ సమీపంలోని ఎస్వీనగర్‌కు చెందిన బాలిపోగు ఇబ్రాయిల్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.4.50,00 విలువ కలిగిన బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఓబులవారిపల్లె, రాజంపేట అర్బన్, రైల్వేకోడూరు, మన్నూరు పోలీసుస్టేషన్ల పరిధిలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన పల్లెపోగ వెంకటసుబ్బయ్యను అరెస్టు చేశారు. పుల్లంపేట మండలం కోండ్లోపల్లె అరుంధతీవాడకు చెందిన వెంకటసుబ్బయ్య నుంచి రూ.6 లక్షల విలువ చేసే 120 గ్రాముల బంగారు నగలను రికవరీ చేశారు. నిందితులిద్దరినీ కోర్టులో హాజరు పరిచి, తర్వాత రిమాండ్‌కు తరలించారు. జిల్లా ఎస్పీ రెడ్డి గంగాధర్‌రావు ఆదేశాల మేరకు డీఎస్పీ చైతన్య పర్యవేక్షణలో సీఐ నరసింహారావు (రాజంపేట అర్బన్), ఎస్.విశ్వనాథరెడ్డి (రైల్వేకోడూరు సీఐ), ఎస్ఐలు పి.వెంకటేశ్వర్లు, శ్రీకాంత్‌రెడ్డి, వీఎల్ ప్రసాద్‌రెడ్డి, ఏఎస్ఐ వర్మ, పీసీలు రామకృష్ణారెడ్డి, ప్రభాకర్, నరసింహ, ఓబులవారిపల్లె పోలీసులు ఉపేంద్ర, మణిరత్నం, మల్లికార్జున స్పెషల్ టీంగా ఏర్పడ్డారు. వారు దొంగలను పట్టుకోవడంలో సక్సెస్ అయ్యారు.

పట్టపగలే ఇంటిలో చోరీ



శ్రీనివాసులు ఇంట్లో బీరువా పగలగొట్టి, వస్తువులు చిందరవందరగా పడేసిన దుండగులు

మదనపల్లె : పట్టపగలే ఇంటి తలుపులు పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడి రూ.4 లక్షల విలువ చేసే నగలు, నగదు అపహరించిన సంఘటన సోమవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని శ్రీనివాసులు, సుగుణ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. సోమవారం ఉదయం వారిద్దరూ ఇంటికి తాళం వేసి పొలం వద్దకు వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం రాగా ఇంటి తాళం పగలగొట్టి ఉండటం, వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 35 గ్రాముల బంగారు నగలు, రూ.2.70 లక్షలు చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

బార్లపల్లెలో..

మండలంలోని చీకలబైలు పంచాయతీ బార్లపల్లెకు చెందిన ప్రసాద్‌రెడ్డి ఇంట్లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.5 లక్షల విలువ చేసే నగలు, నగదు అపహరించారు. ఈ మేరకు బాధితుడు సోమవారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాలూకా సీఐ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా ప్రసాద్ ఇంట్లో జరిగిన చోరీ వెనుక స్థానికుల హస్తం ఉండవచ్చని, త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె అర్బన్‌లోని గాంధీనగర్‌కు చెందిన సంతోష్(15) సోమవారం నందలూరు కన్యక చెరువులోని గుంతల్లో ఈత కొట్టడానికి వెళ్లి మృతి చెందాడు. అతని తండ్రి సుదర్శన జేసీబీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. ముగ్గురు కుమారులున్నారు. వారిలో ఒకరు సంతోష్. ముగ్గురు స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లాడు. అయితే ఇద్దరు ఈత కొడుతున్నారు. గట్టుపై ఉన్న సంతోష్‌కు ఈత రాదు. ప్రమాదవశాత్తు గుంతలో పడి మృతి చెంది చెందాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం తెలుకున్న ఎస్ఐ చెన్నకేశవ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐతోపాటు ఏఎస్ఐ శంకర్ నాయక్, పోలీసులు ఉన్నారు.



మృతి చెందిన సంతోష్

రూ.33 లక్షల 165 మొబైల్ ఫోన్లు రికవరీ



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గంగాధర్ రావు

రాయచోటి : పోలీసు శాఖ చేపట్టిన మొబైల్ ఫోన్ల రికవరీ సత్ఫలితాలను ఇస్తోందని అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావు అన్నారు. సోమవారం సాయంత్రం ఎస్పీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూడో విడతలో రికవరీ చేసిన రూ.33 లక్షల విలువ గల 165 మొబైల్ ఫోన్ల రికవరీని ఎస్పీ వివరించారు. అరెస్ట్ చేసిన ఇద్దరు మొబైల్ ఫోన్ల దొంగలతోపాటు సెల్‌ఫోన్లను కార్యాలయంలో ప్రవేశ పెట్టి మొబైల్ రికవరీ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు పర్యాయాలలో రూ.82 లక్షల విలువజేసే 404 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. గత రెండు పర్యాయాలలో 210 సెల్‌ఫోన్లను రికవరీ చేయగా ప్రస్తుతం 165 సెల్‌ఫోన్లు రికవరీ అయ్యాయని చెప్పారు. దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించడం జరిగిందన్నారు. అలాగే సెల్‌ఫోన్ దుకాణాలలో రసీదులు లేకుండా విక్రయిస్తున్న వారిపైన కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే రాయచోటి పట్టణ పరిధిలో ఎలాంటి రసీదులు లేకుండా విక్రయిస్తున్న మొబైల్ షోరూంపై దాడి చేసి విచారణ చేపట్టామన్నారు. ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన బాధితుల ఫోన్లను రికవరీ చేసి ఇవ్వడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు జిల్లా పోలీస్ వాట్సప్ నంబరు. 8688830012కు హాయ్ అని టైప్ చేయడం ద్వారా లేదా https://forms.gle/CCWgUgkATEbses4B9 లింక్ నొక్కడం ద్వారా పోయిన మొబైల్స్ ఫిర్యాదుల స్వీకరణకు ఎఫ్ఐఆర్ కట్టకుండా, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా సులభతరం చేశామన్నారు. అలాగే మొబైల్ వివరాలను తెలియజేస్తే బాధితులకు త్వరితగతిన అందజేసేందుకు కృషి చేస్తున్నామని ఎస్పీ చెప్పారు. మొబైల్స్ ట్రేస్ చేసిన సైబర్ క్రైమ్, టెక్నికల్ ఎనాలిసిస్ వింగ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

వైట్ కాలర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో అక్కడక్కడా వైట్ కాలర్ నేరాల జాడలు కనిపిస్తున్నాయని, వాటి నివారణకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేకత సాధించిందని జిల్లా ఎస్పీ తెలిపారు. జీవీ ఫుట్‌బాల్, ఆన్‌లైన్ గేమ్స్ యాప్‌లతో ప్రజలను మోసగిస్తున్న కేటుగాళ్లపై చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

మదనపల్లె : మామను హత్య చేసి కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం టూటౌన్ సర్కిల్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన హరికృష్ణ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తుండగా, అతనికి భార్య పావని ఇద్దరు సంతానం ఉన్నారు. ఈ నేపథ్యంలో హరికృష్ణ, పావని దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడి, కొంతకాలంగా కుటుంబ గొడవలు చోటు చేసుకున్నాయి. భర్త వేధింపుల కారణంగా గతంలో పలుమార్లు గొడవపడి అలిగి పుట్టింటికి వెళ్లిపోవడంతోపాటు ఆత్మహత్యకు కూడా యత్నించింది. ఈ నేపథ్యంలో కూతురు, అల్లుడు కుటుంబ సమస్యల పరిష్కారం కోసం శ్రీసత్యసాయి జిల్లా ఆమడగూరు మండలం ఇద్దేవాండ్లపల్లెలో ఉన్న పావని తండ్రి ఆకుల శ్రీనివాసులు ఈ నెల 13వ తేదీ శనివారం మదనపల్లెకు వచ్చాడు. పెద్ద మనుషులతో కలిసి ఇంట్లో పంచాయితీ పెట్టి సర్దిచెబుతుండగా ఆవేశానికి గురైన హరికృష్ణ కత్తెరతో మామను పొడిచి హత్య చేశాడు. అడ్డొచ్చిన భార్యను సైతం పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయి నేరం అంగీకరించాడు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ లోకేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తికి తీవ్ర గాయాలు

పెద్దమండ్యం : అడవి పందుల కోసం వేటగాళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల ఉచ్చులో పడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధి పాపేపల్లె పంచాయతీలోని నడిమగుట్ట వద్ద ఈ సంఘటన జరిగింది. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సీ గొల్లపల్లె పంచాయతీ వెంగంవారిపల్లెకు చెందిన వెంగం మల్లికార్జుననాయుడు (48) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. గ్రామానికి సమీపంలో జరిగిన జాతరకు వెళ్లి కాలినడకన ఆదివారం రాత్రి ఇంటికి తిరిగి వస్తున్నాడు. అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగలడంతో తీవ్ర గాయాల పాలై అక్కడే పడిపోయాడు. అడవి పందుల కోసం విద్యుత్ తీగలు తీసిన వేటగాళ్లు గమనించి బాధితుడిని అక్కడ నుంచి గుట్టుచప్పుడు కాకుండా సమీపంలోని మామిడి తోపులో వదిలి వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు సోమవారం గమనించి బాధితుడిని తిరుపతి రుయాకు తరలించారు. రుయా ఔట్‌పోస్టు పోలీసుల నుంచి సమాచారం వచ్చినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

కలకడ : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రెడ్డిబాబు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వైఎస్సార్ జిల్లా లక్కిరెడ్డిపల్లె మండలం పందిళ్ళవారిపల్లెకు చెందిన మూగిరెడ్డెయ్య కుమారుడు రెడ్డిప్రసాద్(32) కలకడలో హెల్త్‌కేర్ మెడికల్‌షాపు ఏర్పాటు చేశారు. కలకడ మంగళ్ళపల్లెలో నివాసం ఉండగా గత నెల 28వ తేదీన ఇంటి నుంచి దుకాణానికి వచ్చాడు. తర్వాత తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో అతని భార్య క్రిష్ణ కుమారి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రెడ్డిబాబు తెలిపారు.

హత్య కేసులో యావజ్జీవ శిక్ష

ప్రొద్దుటూరు క్రైం : రోకలి బండతో దస్తగిరి అనే వ్యక్తిని కొట్టి హత్య చేసిన కేసులో చిట్టిబోయిన రామాంజనేయులుకు ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా కోర్టు యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.5 లక్షల జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజుపాళెం మండలంలోని కొర్రపాడు గ్రామంలో 2021 మే 9న కొందరు యువకులు క్రికెట్ ఆడుతున్నారు. ఈ క్రమంలో ఆటలో మనస్పర్థలు రావడంతో చిట్టిబోయిన రామాంజనేయులు అనే వ్యక్తి చరణ్ అనే యువకుడిని కొట్టాడు. చరణ్ ఈ విషయాన్ని తన చిన్నాన్న అయిన దస్తగిరికి చెప్పాడు. దీంతో చరణ్‌ను కొట్టిన విషయాన్ని అడిగేందుకు దస్తగిరి.. రామాంజనేయులు ఇంటి వద్దకు వెళ్లాడు. అక్కడ జరిగిన వాగ్వాదంలో రామాంజనేయులు రోకలి బండ తీసుకొని దస్తగిరి తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై మృతి చెందాడు. చరణ్ తండ్రి చీలి సుధాకర్ ఫిర్యాదు మేరకు అప్పటి రాజుపాళెం ఎస్ఐ కృష్ణంరాజునాయక్ కేసు నమోదు చేశారు. ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా కోర్టులో ఈ కేసు వాదనలు జరుగుతూ వచ్చాయి. తుది విచారణలో భాగంగా నేరం రుజువు కావడంతో నిందితుడు రామాంజనేయులుకు యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ. 5 లక్షలు జరిమానా విధిస్తూ రెండవ అదనపు జిల్లా కోర్టు జడ్జి జీఎస్ రమేష్‌కుమార్ సోమవారం తీర్పు చెప్పారు. రూ. 5 లక్షలు చెల్లించని పక్షంలో మరో అయిదేళ్ల పాటు శిక్ష అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు.